క్లుప్తంగా

అచ్చమ్మ తల్లిని దర్శించుకున్న ఒంగోలు డీఎస్పీ



అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లిని దర్శించుకున్న ఒంగోలు డీఎస్పీ మేకా సుధాకర్ దంపతులు

దెందులూరు: ఒంగోలు డీఎస్పీ మేకా సుధాకర్ కుటుంబ సభ్యులు శనివారం గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు డీఎస్పీ కుటుంబ సభ్యులకు స్వాగతం పలికి వేద ఆశీర్వాదం అందించారు. అనంతరం డీఎస్పీ సుధాకర్ మాట్లాడుతూ తమ కుటుంబంతో 26 ఏళ్లుగా ఏటా అమ్మ వారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకుంటున్నామన్నారు.

పంచాయతీలకు డస్ట్‌బిన్ల పంపిణీ



పెదపాడులో పంచాయతీ కార్యదర్శికి డస్ట్‌బిన్లు అందిస్తున్న ఎంపీపీ రత్నకుమారి

పెదపాడు: ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా అందించిన డస్ట్‌బిన్లు ప్రజలకు పంపిణీ చేయాలని పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు డస్ట్‌బిన్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎంపీపీ రత్నకుమారి మాట్లాడుతూ పెదపాడు మండలానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ తడి-పొడి చెత్త సేకరణకు 20వేల డస్ట్‌బిన్లు అందించారు. వాటిని పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేసారు. మండల అభివృద్ధి అధికారి జే తేజరతన్, బత్తుల ఏసు రాజు, చింతల శివయ్య పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన సదస్సు



పెదపాడులో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఈఓఆర్డీ

పెదపాడు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని పెదపాడు ఈఓఆర్డీ సాధనాల సూర్యకుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పెదపాడు మండలంలోని 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.ఓటు నమోదుపై మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జే తేజరతన్ సీసీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ వహించాలి

ఏలూరు రూరల్ : ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సమగ్ర శిక్షా అభియాన్ అదనపు సమన్వయకర్త బి.సోమశేఖర్ అన్నారు. శనివారం ఆయన శనివారపుపేట జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జెడ్పీ పాఠశాలలో కొందరు విద్యార్థులు మధ్యాహ్నపు భోజనం చేయకపోవడాన్ని గమనించారు. మండల పరిషత్ పాఠశాలలో స్మార్ట్ టీవీ బ్లాక్ బోర్డు తక్కువ ఎత్తులోకి మార్చాలని ఆదేశించారు. ప్రత్యేక అవసరాల గల పిల్లల కోసం ప్రతి శనివారం చేపట్టే హోమ్ విజిట్‌ను పరిశీలించారు. పిల్లలకు మెరుగైన సౌకర్యాలు, సేవలు అందించాలని సూచించారు.

వైఎస్సార్ ఆసరాతో డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పోతునూరులో వైఎస్సార్ ఆసరా సంబరాలు



పోతునూరులో వైఎస్సార్ ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: డాక్టర్ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలందరికీ ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం పోతునూరులో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన అనంతరం తూచా తప్పకుండా అమలు చేసిన గొప్ప నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మహిళా ప్రాధాన్యత లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. సీఎం జగన్ మహిళా పక్షపాతి అని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. స్వయం ఉపాధి, కుటుంబ అభివృద్ధి, సామాజిక అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి సంస్కరణలు చేపడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో వివక్షకు తావులేకుండా అందాలన్న ఆశయంతో పని చేస్తున్నారన్నారు. ఆసరా లబ్ధి పొందిన మహిళలందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో 1,456 స్వయం సహాయక సంఘాల్లోని 14,560 మంది మహిళలకు రూ.17.34 కోట్ల ఆసరా చెక్కును, పార్లమెంట్ అభ్యర్థి సునీల్‌కుమార్ అందజేశారు. అనంతరం కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి, భద్రతకు, భవిష్యత్తుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారన్నారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున మహిళలందరి కోసం పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. అనంతరం ఆసరా చెక్కును ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత మహిళలకు అందజేశారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శప్రాయం

రైతు భరోసా భవనాలు, సచివాలయ వ్యవస్థ, వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ ద్వారా దేశమంతా ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీసుకునే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం పోతునూరులో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరితో కలిసి వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ రాష్ట్రంలో రైలు పట్టాలు మాదిరిగా ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు చేర్చిందన్నారు. దివంగత వైఎస్సార్ ఆలోచన విధానంలో మరో అడుగు ముందుకేసి రాష్ట్ర ప్రజల కోసం పటిష్టమైన ప్రణాళికతో ప్రభుత్వ పాలనను గడపగడపకు తీసుకువచ్చిన ఘనత దేశంలో ఒక్క ఏపీకే దక్కిందన్నారు. అవినీతి లేకుండా, ఆలస్యం లేకుండా, అర్హతే ప్రామాణికంగా కుల,మత, వర్గ, పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అందిస్తోందన్నారు. గ్రామగ్రామాన నూతన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వలంటీర్, సచివాలయ వ్యవస్థ అమలుతో ఏపీ రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా పురోగతి సాధించిందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏపీఎం వేణుగోపాల్, ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, కామిరెడ్డి నాని, పార్టీ ఏలూరు మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీటీసీ సున్నా నరేష్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైస్ చైర్మన్ కాటి సుధాకర్, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ రమాదేవి, తలారి రామకృష్ణ, బట్రాజు సత్యనారాయణ, సురేష్, సున్నా ఫణీ, బుద్ధా అర్జున, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు హాజరయ్యారు.



పోతునూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొఠారు, సునీల్‌కుమార్

ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

దెందులూరు: దోసపాడులో శనివారం ఉచ్చుల అగస్టీన్ మరణం బాధాకరమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. అగస్టీన్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, దోసపాడు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత



కొప్పులవారిగూడెంలో పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న గౌడ సేవా సమితి సభ్యులు

పెదవేగి : ఏలూరు గౌడ సేవా సమితి తరపున పెదవేగి మండలం. కొప్పుల వారి గూడెంకి చెందిన మరీదు స్వాతి, మట్టా లక్ష్మి పేద గౌడ కుటుంబాలకు చేయూత కార్యక్రమం ద్వారా సాయం అందించినట్టు సంస్థ జనరల్ సెక్రటరీ, న్యాయవాది బైగాని రంగారావు తెలిపారు. ఏలూరు గౌడ సేవా సమితి తరపున వీరికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, కొత్త బట్టలు, మిక్సీలు రూ. 6వేల నగదు అందజేశారు. ఈ సంస్థను పెదవేగి మండలం పినకడిమి గ్రామానికి చెందిన ఎన్నారై మోదుగుముడి రాజశేఖర్ 2022లో స్థాపించారని అప్పటి నుంచి 40 పేద కుటుంబాలకు చేయూత కార్యక్రమాన్ని అమలు చేశామని రంగారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్లు బొమ్మగాని బాలకృష్ణ, మారగాని శ్రీనివాస్, కామవరపుకోటకు చెందిన, పరస మోహన్, పరస నాగ శీను, కట్టా శ్రీనివాస్, వీరంకి అయ్యప్ప, నూతి రవీంద్ర, పరస శ్రీనివాసరావు, బైగాని భార్గవ్, సురగాని శ్రీనివాసరావు, మోదుగు మూడు వెంకట్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు సీఎం జగన్ కృషి

- భూస్వామిపై కాల్ మనీ కేసు నమోదు చేయాలి
- అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి
- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్



రత్నాపురంలో చెరువును పరిశీలిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, అధికారులు

భీమడోలు: రాష్ట్రంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శక పరిపాలన ద్వారా కృషి చేస్తున్నారని, ప్రభుత్వం బాధిత దళితులకు అండగా నిలుస్తుందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. కోరుకల్లు పంచాయతీ శివారు రత్నాపురంలో దళితుల భూవివాదంపై ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ శనివారం సాయంత్రం సందర్శించారు. వివాదాస్పదమైన ఏడు ఎకరాల ఆక్వా చెరువు ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో చైర్మన్ విచారణ చేసారు. ఈ సందర్భంగా ఏలూరులోని పచ్చిపులుసు శివనారాయణకు తమకు చెందిన ఏడు ఎకరాల ఆక్వా చెరువును తనఖా పెట్టి నాలుగేళ్ల క్రితం రూ.84 లక్షల అప్పు తీసుకున్నామని, సదరు వ్యక్తి ఆ భూమిని తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, భూమిని తన పేరుపై ఆన్‌లైన్ చేయించుకున్నాడని బాధితులు గుమ్మడి కనక శాంతిశ్రీ, గుమ్మడి రంజిత్ తెలిపారు. అప్పు తిరిగి చెల్లిస్తామని శివనారాయణకు చెప్పినా అధిక వడ్డీలు వేసి రూ.2 కోట్లు చెల్లించాలని చెప్పాడని గత్యంతరం లేని పరిస్థితిలో కమిషన్‌ను ఆశ్రయించామని వారన్నారు. ఇటీవల ఆ భూమిని మరొక వ్యక్తికి శివనారాయణ విక్రయించాడని వాపోయారు. ఈ సందర్భంగా చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ రెండు నెలల క్రితమే బాధితులు కమిషన్‌ను ఆశ్రయించారన్నారు. బాధితులకు చెందిన ఆక్వా భూమిని శివనారాయణ ఉద్దేశ్యపూర్వకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, అధిక వడ్డీల పేరుతో వారిని మానసికంగా ఇబ్బందులు గురి చేశాడన్నారు. శివనారాయణ, అతని భార్యపై కాల్ మనీ కేసు నమోదు చేయాలన్నారు. వేరే వ్యక్తికి ఆ భూమిని విక్రయించడంతో రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీలపై అన్యాయంగా దాడులు చేసినా, ఆస్తులను కబ్జాలు చేస్తే కమిషన్ చూస్తూ ఊరుకోదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎస్‌కే ఖాజావలి, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసరావు, తహసీల్దార్ జి.వరహాలయ్య, సీఐ బీబీ రవికుమార్, ఎస్సై వై.సుధాకర్, వీఆర్వో శేషు, దళిత సంఘాల నాయకులు ఎం.సంతోష్‌కుమార్, చంద్రమౌళి పాల్గొన్నారు.

విద్యార్థులకు చక్కని బోధన అందించాలి



భీమడోలులో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.భానుశ్రీ ప్రత్యూషతో మాట్లాడుతున్న ఎంఈవోలు

భీమడోలు: సర్కారీ బడుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు చక్కని విద్యాబోధన అందించాలని ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ జి.భానుశ్రీ ప్రత్యూష అన్నారు. విద్యా సంబంధ కార్యకలాపాలను తెలుసుకునేందుకు శనివారం ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ తన శిక్షణ కాలంలో భాగంగా ఎంపీడీవో టి.స్వర్ణలతతో కలిసి భీమడోలు మండల విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించారు. తొలుత ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కరరావు ఆమెకు స్వాగతం పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న పథకాలు, విద్యా కార్యక్రమాలను వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న నాడు- నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక, ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, బైజ్యూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌ల ద్వారా విద్యా బోధన, పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు యాప్, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను ఎంఈవోలు ఆమెకు వివరించారు. ఎంఆర్సీలోని సిబ్బంది, క్లాంపెక్స్ పరిధిలోని పాఠశాలల, అక్కడ నిర్వహించే విద్యా పరమైన కార్యక్రమాలపై ఆమెకు తెలిపారు. పథకాలను విద్యార్థులకు చేరవ చేయాలని, చిన్నారులకు చక్కని బోధనను అందించి వారికి భవిష్యత్తుకు పునాదులు వేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో టి.స్వర్ణలత మాట్లాడుతూ శిక్షణలో భాగంగా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.భానుశ్రీ ప్రత్యూష పంచాయతీల పాలన పరిశీలనకు, పాఠశాలలు, ఆర్‌బీకేలు, ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తారని తెలిపారు.

మహిళా ఓటర్ల పోలింగ్ శాతం పెరగాలి



భీమడోలు ర్యాలీలో పాల్గొన్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.భానుశ్రీ ప్రత్యూష, ఎంపీడీవో

భీమడోలు: సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుని ఓటింగ్ శాతాన్ని పెంచుకుని సమాజాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.భానుశ్రీ ప్రత్యూష అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో శనివారం స్వీప్ 2024 జిల్లా కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా నిర్వహించిన మహిళా చైతన్య కార్యక్రమానికి ఎంపీడీవో టి.స్వర్ణలత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జి.భానుశ్రీ ప్రత్యూష మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుత పాలనకు ఓటు ఆయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చైతన్యపర్చాల్సిన ఆవశ్యకత మనపై ఉందన్నారు. రానున్న అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో ఓటు శాతాన్ని 92శాతానికి పెంచాలన్నారు. వాస్తవానికి పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నప్పటికీ గత ఎన్నికల పోలింగ్ గణాంకాల ప్రకారం మహిళా పోలింగ్ శాతం తక్కువగా ఉంటుందన్నారు. ఈ విధానానికి స్వస్తి పలికి నూరు శాతం మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా గ్రామాల్లో డ్వాక్రా సంఘాల ప్రతినిధులు అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. భీమడోలు ఎంపీడీవో టి.స్వర్ణలత మాట్లాడుతూ ఈనెల 15 నుంచి మార్చి 31వ తేదీ వరకు 45 రోజుల పాటు గ్రామాల్లో ఓటు వినియోగంపై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మహిళా సమాఖ్య ప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు, సచివాలయ ఉద్యోగులు ఓటు హక్కుపై చైతన్య ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ ప్రారంభించారు. పురవీధుల్లో ర్యాలీ, ప్రదర్శన చేసారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ.సుందరి, ఏపీఎం సీహెచ్ సురేష్‌కుమార్, గ్రామ కార్యదర్శులు నందేటి ఠాగూర్, వెంకట్రావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



పెదవేగి కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న తహసీల్దార్, ఏపీఎం, మహిళలు

పెదవేగి : రానున్న ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల ద్వారా ప్రజలు తమ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో తెలియజేసేందుకు డ్వాక్రా సంఘాలకు వెలుగు ఆధ్వర్యంలో శనివారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా ప్రధాన ఎన్నికల అధికారి, కలెక్టర్ వె ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు ఈ అవగాహన సదస్సు నిర్వహించామని పెదవేగి మండల తహసీల్దార్ సూర్యప్రభ, వెలుగు ఏపీఎం శరత్ బాబు తెలిపారు. పెదవేగి మండలంలో ఆయా గ్రామాల్లో ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. తహసీల్దార్ సూర్య ప్రభ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌ల వద్ద జరిగే అక్రమాలపై సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఈవీఎం మిషన్లు, వీవీ ప్యాట్‌ల వినియోగంపై మహిళలకు అధికారులు అవగాహన కల్పించారు. పెదవేగి ప్రధాన రహదారి వెంట ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానహారంగా నిలిచి ఓటు హక్కు వినియోగంపై స్వీప్ ఓటు విధానంపై నినాదాలు చేశారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

ఉంగుటూరు: ప్రజలకు విశేష సేవలందించిన వలంటీర్లకు ఆదివారం సాయంత్రం 4గంటలకు నారాయణపురం ఐస్ పరిశ్రమ ప్రాంగణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ఎంపీడీవో శర్మ తెలిపారు. మండలంలో 476 మందిలో 469 మందికి వలంటీర్లకు ప్రశంసాపత్రాలు, అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు. సేవా వజ్రాల పురస్కారాలకు ఎంపికైన ఎ.గోకవరం- పెండెం దేవమణికి, కైకరం- పి.చంద్రనాగ అంజిలీదేవికి ఒక్కొకరికి రూ.45 వేలు నగదు, ప్రశంసా పత్రం అందజేసి సత్కరిస్తారని తెలిపారు. ఎ.గోకవరం-కానుబోయిన పద్మ, చేబ్రోలు-1 కలిగట్ల ఆదిలక్ష్మి, గోపినాథపట్నం-పేద్ద లక్ష్మి, కైకరం-2లో నూతులపాటి మాధురి, ఉంగుటూరు- రంగు మోనికాదేవికి రూ. 30వేలు నగదుతోపాటు సేవరత్న అవార్డు, 462 మందికి సేవామిత్ర అవార్డులు ఒకొక్కరికీ రూ.15వేలు నగదు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శర్మ వివరించారు.

వైభవంగా భావనారుషి కల్యాణ మహోత్సవం



భావనారుషికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : భక్తిశ్రద్ధలతో వైభోపేతంగా శనివారం భావనారుషి కల్యాణ మహోత్సవం నిర్వహించారు.పెదవేగి మండలం విజయరాయిలో పద్మశాలీల ఆహ్వానం మేరకు శ్రీభద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం గార్లమడుగులో మేడికొండ శ్రీనివాస్ తల్లి సంతాప సభలో ఎమ్మెల్యే కొఠారు పాల్గొన్నారు.

నూకాయమ్మకు ఘన నివాళి



గణపవరంలో నూకాయమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, సాక్షి డైరెక్టర్ వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి

ఉంగుటూరు (గణపవరం) : వేగేశ్న ఫౌండేషన్ ఎండీ అనంతకోటి రాజు తల్లి నూకాయమ్మ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, సాక్షి డైరెక్టర్ వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి ఏలూరు జిల్లా గణపవరంలో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె చిత్రపటం వద్ద పువ్వులు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అనంతకోటి రాజును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు నడింపల్లి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కుల చట్టంతో రైతులకు నష్టం

ఉంగుటూరు: ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం కలిగించే భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండు చేశారు. శనివారం కైకరంలో ప్రజా సంఘాల భవనంలో భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూయాజమాన్య హక్కుల చట్టం 2022 పేరుతో 2023 అక్టోబరు 31న జారీ చేసిన జీవో 512 ద్వారా తీసుకువచ్చిన చట్టంలో రైతులకు నష్టం కలిగించే నిబంధనలున్నాయని అన్నారు. రైతు సంఘం జిల్లా నాయకుడు గుత్తికొండ వెంకటకృష్ణారావు, ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కన్వీనర్ కోర్ని అప్పారావు పాల్గొన్నారు.

